సాక్షి
వికారాబాద్

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



చెలగాటమా!

ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. 8లో▸



ఎమ్మెల్యే చేసిందేమీలేదు

కొడంగల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చేసిందేమిలేదని గురునాథ్‌రెడ్డి విమర్శించారు. 8లో▸



సామాజిక తనిఖీకి సిద్ధం

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ చేపట్టనున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

'ప్రజావాణి'కి 163 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 163 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా లింగ్యానాయక్ మాట్లాడుతూ.. ప్రజలు నమ్మకంతో దూరప్రాంతాల నుంచి ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని.. సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

సెప్టెంబర్ 5న తీజ్

సెప్టెంబర్ 5న స్థానిక అంబేడ్కర్ భవన్‌లో తీజ్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అధికారులతో కలిసి ఉత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లింగ్యానాయక్ మాట్లాడుతూ.. ఉత్సవాల్లో బంజారా నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కోటాజి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ పోటీల్లో 'కేజీబీవీ' సత్తా

విద్యార్థినులను అభినందించిన ఎస్పీ



విజేతలను అభినందిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: 37వ సౌత్ ఇండియా కుంగ్‌ఫూ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కొడంగల్ కేజీబీవీ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. న్యూ మాంక్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొందుర్గులో నిర్వహించిన పోటీల్లో జ్యోతి, కృష్ణవేణి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా వారిని సోమవారం ఎస్పీ కోటిరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు.

డ్రైవర్లకు మానసిక ప్రశాంతత అవసరం

వికారాబాద్ డీఎస్పీ నర్సింలు

అనంతగిరి: పాఠశాల బస్సులు, ఆటోలు నడిపే డ్రైవర్లు జాగ్రత్త పాటించాలని వికారాబాద్ డీఎస్పీ నర్సింలు సూచించారు. సోమవారం ఆయన పట్టణంలోని ఓ పాఠశాలలో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. డ్రైవర్లు మనసును ప్రశాంతంగా ఉంచుకుని స్టీరింగ్ పట్టాలని సూచించారు. ఇంటి నుంచి పదినిమిషాల ముందుగానే బయలుదేరాలని చెప్పారు. పాఠశాలల యాజమాన్యాలు డ్రైవర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ బస్సు కండీషన్‌ను తెలుసుకోవాలన్నారు. డ్రైవర్లు నిర్ణీత వేగం మించి నడపకూడదన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ సీఐ శ్రీను, ఎస్సైలు, ఆయా పాఠశాలల బస్సుల డ్రైవర్లు ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతారంజిత్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



సీతారంజిత్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మర్పల్లి: టీటీడీ బోర్డు సభ్యురాలిగా నియమితులైన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సతీమని సీతా రంజిత్‌రెడ్డికి మర్పల్లి జెడ్పీటీసీ సభ్యుడు మధూకర్, బీఆర్‌ఎస్ మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆమె నివాసానికి వెళ్లిన నాయకులు ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రైతు బంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులున్నారు.

'డబుల్' ట్రబుల్

ఇళ్లు కట్టరు.. కట్టినవి ఇవ్వరు

పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. నిర్మాణ పనులు నెమ్మదించడంతో పంపిణీ సాధ్యమవడం లేదు. నిర్మాణం పూర్తయిన చోట లబ్ధిదారుల ఎంపిక కొలిక్కి రావడం లేదు. దీంతో లబ్ధిదారుల్లో అసహనం వ్యక్తమవుతోంది.

- రెండుసార్లు స్క్రీనింగ్ పూర్తి చేసిన అధికారులు
- నేటికీ కొలిక్కిరాని అర్హుల జాబితా
- దరఖాస్తుదారుల్లో అసహనం



వికారాబాద్‌లో పునాదులకే పరిమితమైన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు

వికారాబాద్: డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం ఏర్పడుతుండగా.. పూర్తయిన ఇళ్లు అర్హులకు పంచడంలోనూ అంతకంటే రెండింతల ఆలస్యం చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టడంతో ఇక డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం కథ కంచికేనా..? అనే అనుమానాలు దరఖాస్తుదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. పూర్తయిన, కావచ్చిన డబుల్ బెడ్రూం ఇళ్లు అర్హులకు పంచేందుకు అధికారులు ఏడాదిగా కసరత్తు చేస్తున్నా.. లబ్ధిదారులకు కేటాయించడంలో మీనమేశాలు లెక్కిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగేళ్లుగా మొత్తం 1,031 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొన్ని చోట్ల తుది మెరుగులు, చిన్న చితకా పనులు మినహా దాదాపు పూర్తయ్యాయి. ప్రభుత్వం మార్చి నెలాఖరుకు పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఇప్పటికే గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో పేదల నుంచి దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. రెండుసార్లు విచారణ పూర్తి చేసిన అధికారులు పంపిణీలో మాత్రం చొరవచూపడం లేదు. కొన్ని మండలాల్లో పనులు పునాదులకే పరిమితమయ్యాయి.

ఇళ్ల నిర్మాణం వివరాలు

మండలం	పూర్తైన ఇళ్లు
ధారూరు	120
మర్పల్లి	120
యాలాల్	180
తాండూరు	401
పరిగి	180
దౌల్తాబాద్	30
మొత్తం	1,031

రెండు పర్యాయాలు విచారణ

అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిపి ముగ్గురు చొప్పున ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు దరఖాస్తుదారుల జాబితా ఆధారంగా వార్డుల వారీగా ఇంటింటికీ వెళ్లి విచారణ చేపట్టారు. దరఖాస్తులకు అందుబాటులో ఉన్న ఇళ్ల సంఖ్యకు వ్యత్యాసం ఉండడంతో పంపిణీకి అడ్డంకులు ఎదురవుతున్నాయి. దరఖాస్తుదారుల్లలోనూ కేవలం 50 శాతమే అర్హులున్నట్లు అధికారుల బృందం తేల్చింది. వీరి సంఖ్యను తగ్గించేందుకు మరోమారు విచారణ పూర్తి చేసినా పంపిణీకి చర్యలు తీసుకోవడం లేదు.

పదింతల ఎక్కువ దరఖాస్తులు

ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 5,740 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసింది. పనులు చేపట్టేందుకు 2016లో భూమి పూజ చేశారు. అనంతరం వీటిని 3,800కు కుదించారు. ప్రస్తుతం 2,257 ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వీటిలో 1,031 ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తికావచ్చాయి. 1,543 ఇళ్ల నిర్మాణం ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. పూర్తయినఇళ్లను మండలాల వారీగా ఎంత మంది లబ్ధిదారులకు అందించాలో నిర్ణయించారు. కాగా ఇళ్ల నిర్మాణం పూర్తయిన గ్రామాలు, మున్సిపాలిటీల నుంచి దరఖాస్తులు స్వీకరించగా పదింతలు ఎక్కువ వచ్చాయి.



మాట్లాడుతున్న స్మిత సబర్వాల్, చిత్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి

కోటి కుటుంబాలకుపైగా భగీరథ తాగునీరు

- పథకం కార్యదర్శి స్మిత సబర్వాల్

పరిగి: మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రంలో కోటిపైగా కుటుంబాలకు రక్షిత మంచినీరు అందిస్తున్నామని మిషన్ భగీరథ కార్యదర్శి స్మిత సబర్వాల్ అన్నారు. మండల పరిధిలోని రాఘవపూర్ నీటి శుద్ధి కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మిషన్ భగీరథ సహాయకుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ సహాయకులు చేయాల్సిన పనులు, శిక్షణలో పొందిన అనుభూతులపై వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్మిత సబర్వాల్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తోందన్నారు. ఈ నీటితో కలిగే ప్రయోజనాలను శిక్షణ పొందిన సహాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు నీటి సరఫరా పరిశీలిస్తూ సమస్యలుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ప్రతిభ కష్టపడే తత్వం ఉన్న వారు మిషన్ భగీరథలో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజల ఆరోగ్యం మిషన్ భగీరథ సహాయకుల చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, మిషన్ భగీరథ ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజనీర్ చెన్నారెడ్డి, జ్ఞాన్‌కుమార్, రాంచందర్, లలిత, వినోబాదేవి, చంద్రమౌళి, ఆంజనేయులు, డీఆర్‌డీఓ కృష్ణన్, ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్ దానయ్య, ఎంపీడీఓ శేషగిరిశర్మ, రాఘవాపూర్, జాపర్‌పల్లి సర్పంచ్‌లు జగన్, అనిత తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని వినతి

మిషన్ భగీరథ ప్లాంట్ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, సర్పంచ్ అనిత మిషన్ భగీరథ కార్యదర్శి స్మిత సబర్వాల్‌కు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుంటుంబాలు అభివృద్ధి పనుల కారణంగా భూములు కోల్పోయారు. వారికి ప్రభుత్వం అందజేస్తున్న దళిత బంధు, బీసీ బంధు పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. జాపర్‌పల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని విన్నవించారు. గ్రామాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు

- పథకాల అమలుకు తక్షణ చర్యలు చేపట్టండి
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ప్రణాళికా బద్ధంగా పనిచేస్తూ అధికారులు ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ప్రభుత్వ కార్యక్రమాల అమలు లక్ష్యాలపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి పాల్గొన్నారు. సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధాప్య, ఆసరా పెన్షన్‌దారులు మరణిస్తే వారి భాగస్వామికి మంజూరు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. గొర్రెల పంపిణీ పథకం కింద జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. బీసీ కులవృత్తుల ఆర్థికసాయం రెండో దశ అమలుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గృహలక్ష్మి పథకానికి వచ్చిన దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసిన తర్వాత ఆన్లైన్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. రెండో విడత దళిత బంధు దరఖాస్తులను విచారించి అర్హులను ఎంపిక చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ విజయకుమారి, అటవీశాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, జెడ్పీ సీఈఓ సుభాషిణి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి నిరవధిక సమ్మె

- మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమ్మెపై ప్రభుత్వం స్పందించకుంటే సెప్టెంబర్ 1నుంచి విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడతామని మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య హెచ్చరించారు. సోమవారం ఆయన ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ.. వారం రోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు, జవాన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, వాటర్ సప్లై వర్కర్లు, ఎలక్ట్రీషియన్లు, బిల్ కలెక్టర్లు, సిస్టం మేనేజర్స్, సిస్టం అసిస్టెంట్లు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇరవై ఏళ్లుగా 243 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటోదని ఆరోపించారు. ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు దావూద్, వినోద్, కార్యదర్శులు శంకర్, నాగేందర్ రెడ్డి, రాజు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం నోరుమెదపరేం..?

- వీరజవాన్ చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శించిన ఈటల రాజేందర్
- కేంద్రం తరఫున సాయం చేస్తామని హామీ



చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఈటల రాజేందర్ తదితరులు

కొందుర్గు: దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోతున్న వీర జవాన్ల కుటుంబాలను ఆదుకోవాలని, ఇందు కోసం ప్రత్యేక పాలసీని ఏర్పాటు చేయాలని బీజేపీ తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండలంలోని తిరమల దేవునిపల్లిని సందర్శించి ఇటీవల మృతిచెందిన వీర జవాన్ చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కొన్ని సందర్భాల్లో వెంటనే స్పందించి ఊహించని విధంగా హామీలు ఇస్తారని, అయితే వీర జవాన్ చంద్రశేఖర్ విషయంలో ఎలాంటి హామీ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. దేశం అబ్బురపడేలా వీర జవాన్ల కుటుంబాలను ఆదుకుంటామని చెప్పిన కేసీఆర్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. చంద్రశేఖర్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తరఫున చంద్రశేఖర్ కుటుంబానికి అన్ని సదుపాయాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్య, శంకర్, శివారెడ్డి, శ్రీశైలం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'నో డ్యూస్' ఇప్పించండి

- రుణమాఫీ పేరిట బీఆర్‌ఎస్ కొత్త నాటకం
- కాంగ్రెస్‌తోనే బహుజన రాజ్యాధికారం
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: రుణమాఫీ మాటలకే పరిమితం చేయకుండా రైతులకు బ్యాంకు నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ అందించేలా చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీఆర్‌ఆర్ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో రైతు రుణమాఫీ అంటూ కొత్త నాటకానికి తెరలేపిందన్నారు. లేని పోని మాటలను చెబుతూ రైతులను మోసం చేసేందుకు యత్నిస్తోందన్నారు. ఇప్పటికీ కొంత మంది రైతుల రూ.25వేల రుణమాఫీ కాలేదని విమర్శించారు. దళిత, గిరిజనులకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇరు వర్గాల మధ్య గొడవలు పెడుతూ సమస్యను పక్కదారి పట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌తోనే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని చెప్పారు. టికెట్ల కేటాయింపు విషయంలో కార్యకర్తలు ప్రచారాలను నమ్మొద్దని సూచించారు. అనంతరం గోరిగడ్డ తండాకు చెందిన లాలూనాయక్, పలువురు నాయకులకు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్–2 అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, నాయకులు ప్రకాశ్ రెడ్డి, జలీల్, సురేశ్, లాలు, రాంచందర్, వెంకటేశ్, గోవర్ధన్ రెడ్డి, ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్ రెడ్డి

మహనీయులు స్ఫూర్తి ప్రదాతలు

- వారి పోరాట పటిమను భవిష్యత్ తరాలకు అందించాలి
- మంత్రులు సబితారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి
- రావుపల్లిలో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ
- మల్లారెడ్డిగూడ, రావుపల్లిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



రావుపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు సబితారెడ్డి, మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: మహనీయులు స్ఫూర్తి ప్రదాతలని, వారు చూపిన బాటలో నడుద్దామని మంత్రులు సబితా రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలం రావుపల్లిలో సర్పంచ్ శ్రీనివాస్ దాతల సహకారంతో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీ, అంబేడ్కర్, మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్‌ల విగ్రహాలను సోమవారం వారు ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో రూ. 10లక్షలతో నిర్మించిన ఓపెన్ డ్రైనేజీని, రూ. 45లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ. 12.60లక్షలతో నిర్మించిన వైకుంఠధామన్ని స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. మల్లారెడ్డిగూడలో రూ. 20 లక్షలతో నిర్మించిన పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలను, సీసీ రోడ్లను ప్రారంభించారు. రావుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు మాట్లాడారు. గ్రామంలో ఒకే సారి ఐదుమంది మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. వారి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. వారి పోరాట పటిమను భవిష్యత్ తరాలకు అందించాలి సూచించారు. నియోజకవర్గంలో స్వర్గీయ ఇంద్రారెడ్డి చెరగని ముద్ర వేశారని, ఏ గ్రామానికి వెళ్లినా ఆయన పేరు వినిపిస్తోందన్నారు. షాబాద్, శంకర్‌పల్లి ప్రాంతాల్లో అనేక పరిశ్రమలు రావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందిస్తామని అన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలన్నారు. ఆయన్ను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆదరించి మూడోసారి గెలిపించాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మహిళా సంఘాలకు అభయహస్తం నిధులు వారం రోజుల్లో విడుదలవుతాయని చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పీ కృష్ణారెడ్డి, ఎంపీపీ ఎం విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం మాలతి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట రంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీలు రవీందర్, స్వరూప, వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ సర్పంచులు రాంచంద్రయ్య, హన్మంత్‌రెడ్డి, బుచ్చయ్య, నాగిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

చేవెళ్లలో రూ. 1. 80 కోట్ల వ్యయంతో అధునాతన గ్రంథాలయ భవన నిర్మాణానికి, అలాగే సింగప్పగూడలో పంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాయల సంస్థ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని అన్నారు. తెలంగాణ తరహా పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీనే గెలిపిస్తామని సింగప్పగూడ ప్రజలు తీర్మానించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ శైలజ, ఈఈ కుమార్‌గౌడ్, ఎంపీడీ హిమబిందు, తహసీల్దార్ కృష్ణయ్య, ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పశువుల కొట్టంగా పల్లె దవాఖాన



పశువుల కొట్టంగా మారిన పల్లె దవాఖాన

దౌల్తాబాద్: మండలంలోని ఈర్లపల్లిలో పల్లెద వాఖాన పశువుల కొట్టంగా మారింది. సుమారు ఎనిమిది సంవత్సరాల క్రితం గ్రామ శివారున ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిర్మించారు. ఈ భవనాన్ని అప్పటి ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అయితే, వైద్యసిబ్బంది కొద్దిరోజులు మాత్రమే ఈ భవనంలో సేవలు అందించారు. తర్వాత భవనాన్ని వృథాగా వదిలేశారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలోని ఆరోగ్య కేంద్రాలను పల్లె దవఖానాలుగా మార్చాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే, వైద్యాధికారులు పశువుల కొట్టానికి పల్లె దవాఖానా అని బోర్డు రాశారు. కానీ సేవలు మాత్రం అందించడంలేదు. ఇప్పటికైనా భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి వైద్యసేవలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుమ్ములేస్తోంది..



దుమ్ములేస్తున్న గోపన్‌పల్లి రోడ్డు

తాండూరు రూరల్: మండలంలోని కరన్‌కోట్ గ్రామానికి వెళ్లేరోడ్డు ధ్వంసమై దుమ్ములేస్తోంది. గౌతపూర్ చెక్‌పోస్టు నుంచి గోపన్‌పల్లి వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. గౌతపూర్ నుంచి కరన్‌కోట్ గ్రామ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ మట్టి, కంకరవేసి వదిలేశాడు. దీంతో ప్రతినిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు వందల సంఖ్యలో లారీలు రాకపోకలు సాగిస్తుంటారు. లారీలు వెళ్లే క్రమంలో ఒక్కసారిగా దుమ్ములేవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెనుకల వచ్చే వాహనదారుల కళ్లల్లో దుమ్ము పడుతోందని పలువురు వాపోతున్నారు. వెంటనే గోపన్‌పల్లి రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు 'దోస్త్ స్పెషల్ డ్రైవ్'



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజారాం

కొడంగల్ రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ స్పెషల్ డ్రైవ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ జె.రాజారాం అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కళాశాలలో బీఏ ఇంగ్లిష్ మీడియం 48సీట్లు, బీఏ తెలుగు మీడియంలో 47సీట్లు, బీకాం సీఏ ఇంగ్లిష్ మీడియం 31సీట్లు, బీఎస్సీ బీజెడ్‌సీ ఇంగ్లిష్ 41సీట్లు, తెలుగు మీడియంలో 36సీట్లు, బీఎస్సీ ఎంపీసీలో 48సీట్లు ఖాళీగా ఉన్నాయని విద్యార్థులు దోస్త్ స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకుంటూ సెప్టెంబర్ 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో.. చెలగాటమా!



మిట్టబాసుపల్లి శివారులో ఉన్న జీప్సం ఫ్యాక్టరీ



ఫ్యాక్టరీ ఎదుటే ఉన్న వసతి గృహం



జీప్సం ఫ్యాక్టరీ నుంచి ఎర్రగా పొలాలకు వెళ్తున్న నీళ్లు

- హాస్టల్ సమీపంలో జీప్సం ఫ్యాక్టరీ
- కాలుష్యం, దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి
- పట్టించుకోని అధికారులు

తాండూరు రూరల్: వ్యాపారంలో ధనార్జనే ధ్యేయంగా కొందరు వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. బంగారు భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ప్రతి రోజు జీప్సం ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసనతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎవరైన ఫిర్యాదు చేస్తే వారిని బెదిరిస్తూ .. అధికారుల అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదంతా మిట్టబాసుపల్లి శివారులోని ఓ జీప్సం ఫ్యాక్టరీ ఆగడాలు. వివరాల్లోకి వెళ్లితే.. తాండూరు మండలం జినుగుర్తి గేటు సమీపంలోని మిట్టబాసుపల్లికి వెళ్లేదారిలో ఓ జీప్సం ఫ్యాక్టరీ ఉంది. పక్కే కేజీబీవీ ఉంది. గుజరాత్‌కు చెందిన కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా జీప్సం ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన నాయకుడికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

1150 మంది విద్యార్థులు

జీప్సం ఫ్యాక్టరీ సమీపంలో కేజీబీవీలో 430 మంది విద్యార్థులు స్థానికంగా హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. ఇందులో ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా ఉన్నారు. అలాగే మోడల్ స్కూల్, కళాశాలతో కలిపి 720 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వంద మందికి పైగా బాలికలు స్థానికంగా ఉండే హాస్టల్‌లో ఉంటున్నారు. జీప్సం ఫ్యాక్టరీ వల్ల విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

ఎర్రగా మారిన నీళ్లు..

జీప్సం ఫ్యాక్టరీ నుంచి వచ్చే నీళ్లు ఎర్రగా మారి పొలాలకు వెళ్తున్నాయి. దీంతో పంటలు కూడా ఎదగడం లేదు. గతంలో చుట్టూ పక్కల పొలాల రైతులు ఆందోళన చేసినా లాభం లేకుండాపోయింది. గొర్రెలు , మేకలు, పశువులకు దాహం వేస్తే ఆ ఎర్రనీళ్లే దిక్కయ్యాయి. దీంతో పశువులు రోగాల బారిన పడుతున్నాయి.

పట్టించుకోని పీబీసీ అధికారులు..

జీప్సం ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే పీబీసీ అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారని విమర్శలున్నాయి.

అధికార పార్టీ నాయకుల అండ...

జీప్సం ఫ్యాక్టరీపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే అధికారపార్టీ నాయకులు రంగంలోకి దిగుతారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆ ఫ్యాక్టరీ మనవాళ్లది అక్కడికి వెళ్లొద్దని తేల్చి చెబుతున్నారు. దీంతో అధికారులు ఏం చేయలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన..

పిల్లలు కష్టపడి చదువుకొని ఉన్నతస్థాయికి వస్తారనే ఉద్దేశంతో హాస్టల్‌లో ఉంచి విద్యార్థులను తల్లిదండ్రులు చదివిస్తున్నారు. కానీ హాస్టల్ పక్కనే ఉన్న జీప్సం ఫ్యాక్టరీ వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. తల్లిదండ్రులు స్థానికులు కాకపో వడంతో ఫిర్యాదు చేయడానికి కూడా వెనకడుగు వేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల బెది రింపులతో ఉపాధ్యాయులు కూడా ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసనపై నోరు మెదపడం లేదు.

కలెక్టర్ స్పందించాలి

విద్యార్థుల జీవితాలతో గెలగాటమాడుతునన జీప్సం ఫ్యాక్టరీపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలుకోరుతున్నారు. కలెక్టర్ తనిఖీ చేసి...హాస్టల్ విద్యార్థులతో మాట్లాడితే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉరేసుకుందా.. గుండెపోటా?

- ఇంటర్ విద్యార్థిని మృతి అనుమానాస్పదం



అపూర్వ (ఫైల్)

ధారూరు: ఇంటర్ విద్యార్థిని మృతి అనుమానాస్పదంగా మారింది. ఉరేసుకుని మృతిచెందినట్లు గ్రామస్తులు చెబుతుండగా.. తమ బిడ్డ గుండె పోటుతో మృతిచెందిందని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు చెప్పడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన అపూర్వ (18) రంగారెడ్డి జిల్లా షాబాద్‌లోని ఓ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వారం రోజుల క్రితం కంటి నొప్పితో హాస్టల్ నుంచి ఇంటికి వచ్చింది. తండ్రి బైండ్ల వెంకటయ్యకు ఫోన్ చేసిన ప్రిన్సిపల్ బాలికను పంపించాలని సూచించారు. దీంతో తల్లిదండ్రులు అపూర్వకు విషయం చెప్పి హాస్టల్‌కు వెళ్లమని సూచించారు. ఆమె మాత్రం రాఖీ పౌర్ణమి తర్వాత వెళతానని చెప్పడంతో చిన్నపాటి వాగ్వాదం జరిగింది. మిన్నకుండిపోయిన తల్లిదండ్రులు ఎవరి పనులపై వారు వెళ్లిపోయారు. తమ్ముడు సైతం ఇంట్లో లేకపోవడంతో ఒంటరిగా ఉన్న అపూర్వ చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లగా.. తమ కూతురు గుండెపో టుతో మృతి చెందిందని తల్లిదండ్రులు చెప్పారు. ఈ విషయమై ఫిర్యాదు చేసేందుకు నిరాకరించారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించండి

సంఘం జిల్లా అధ్యక్షురాలు మాధవి



ఎంపీడీఓ జయరాంకు వినతి పత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

దోమ : దీర్ఘకాలంగా ఆశవర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆ సంఘం ఆశవర్కర్ల జిల్లా అధ్యక్షురాలు మాధవి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశవర్కర్లు ప్రజలకు ఎన్నో సేవలను అందిస్తున్నప్పటికీ ప్రభుత్వం తమను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. చాలీచాలని జీతాలతో ఉద్యోగాలను చేస్తూ కుటుంబాలను నెట్టుకోస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రతి ఆశవర్కర్లకు హెల్త్ కార్డులు అందించి ప్రమాద బీమా కింద రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. టీబీ, లెప్రసీ, కంటి వెలుగు, తదితర కార్యక్రమాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు యశోద, శోభ, బుడ్డమ్మ, యాదమ్మ అంజమ్మ, శ్రీలత, ఉమారాణి, చంద్రకళ, శివరాణి. సత్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



జాహంగీర్ (ఫైల్)

దోమ : ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన బొంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని బొంపల్లి గ్రామానికి చెందిన దూదెకుల జాహంగీర్(70) అనే వ్యక్తి గత మూడు రోజుల క్రితం పరిగి పట్టణానికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. అయితే మూడు రోజులైన ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చుట్టు పక్కల, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని రెండవ కుమారుడు మోయిన్ తమ తండ్రి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని సోషల్ మీడియాలో అతని ఫోటోను షేర్ చేస్తు న్నారు. ఎవరికైనా కనిపిస్తే 9553966853, 94412 22371 నంబర్లకు తెలపాలని వేడుకుంటున్నారు.

సీతారెడ్డికి శుభాకాంక్షలు



రంజిత్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న నేతలు

మర్పల్లి: టీటీడీ బోర్డు మెంబర్‌గా నియమితులైన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డికి మర్పల్లి జెడ్పీటీసీ మధుకర్, మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఆమె నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అ ధ్యక్షుడు శ్రీనివాస్, రైతుబంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఎక్కడ?



ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల ధర్నా
- అరెస్టు చేసి పీఎస్‌కు తరలించిన పోలీసులు

వికారాబాద్ అర్బన్: పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మాట మార్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ మండిపడ్డారు. సోమవారం వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలకు ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాళ్ల ఇల్లు మాత్రమే బాగు చేసుకుంటున్నారని విమర్శించారు. ప్రతిసారి ఎన్నికల్లో సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఈసారి ప్రజల నుంచి వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు. గృహలక్ష్మి పేరుతో మరోసారి పేదల ఓట్లను కొనే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహలక్ష్మి పథకం అర్హులకు ఇవ్వకుండా ఎమ్మెల్యే సిఫార్సు చేసిన వారికి మాత్రమే ఇస్తున్నట్లు ఆరోపించారు. ఎమ్మెల్యే తీరుతో ఎంతోమంది పేదలకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించే వరకు బీజేపీ పోరాడుతుందని తెలిపారు. క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీనాయకులను పోలీసులు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తులపై విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాండు గౌడ్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన తాండూరు విద్యార్థులు

తాండూరు టౌన్ : 37వ సౌతిండియా కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తాండూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కొందుర్గులో ఆదివారం జరిగిన చాంపియన్ షిప్ పోటీల్లో తాండూరుకు చెందిన పింకి, మణికంఠ, ఎండీ అజార్, మిక్కీలు గోల్డ్ మెడల్స్‌ను సాధించారు. అలాగే లక్కీ, ఎండీ జహూర్ సిల్వర్ పతకాలు సాధించారు. కరాటే సీనియర్ మాస్టర్ బీవీ సాయికుమార్ మాట్లాడుతూ.. కరాటేతో ఆత్మరక్షణతో పాటు పిల్లలు మానసికంగా, శారీరకంగా ఎదుగుదల ఉంటుందన్నారు. తాండూరు పట్టణంలో విద్యార్థులకు ఉచితంగా కరాటే నేర్పిస్తున్నామని తెలిపారు. వివరాలకు 9848743067, 8217418147 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

తెలుగు జాతి గర్వించదగిన నేత ఎన్టీఆర్

షాద్‌నగర్: దివంగత నేత ఎన్టీఆర్ తెలుగు జాతి గర్వించదగిన వ్యక్తి అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు అన్నారు. ఎన్టీఆర్ పేరిట కేంద్ర ప్రభుత్వం వంద రూపాయల నాణేన్ని విడుదల చేసిన సందర్భంగా.. పౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం బీవీరావు నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. బడుగుబలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు పినబాక ప్రభాకర్, శ్రీను, రమేశ్, సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం



రెస్టారెంట్‌లో కాలిపోయిన సామగ్రిని బయటకు తెస్తున్న సిబ్బంది

రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం

ఇబ్రహీంపట్నం రూరల్: షార్ట్‌సర్క్యూట్ కారణంగా రెస్టారెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంతో రూ.20 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధి టీసీఎస్ సమీపంలోని ద ఫుడ్ ట్రైన్ రెస్టారెంట్‌లో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం 7గంటల సమయంలో లోపలి నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థా నికులు యజమాని అఖిల్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో ఆయ న రెస్టారెంట్‌లో పనిచేసే సిబ్బందిని పంపించారు. తలుపులు తీసి చూడగా కౌంటర్ వద్ద మంటలు ఎగిసి పడుతున్నాయి. పొగ పూర్తిగా కమ్మేయడంతో మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. దీంతో ఫైర్ అధికారులకు ఫోన్ చేయగా.. వచ్చి మంటలు ఆర్పారు. కౌంటర్, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల నష్టం వాటిల్లిందని యజమానులు వాసుదేవ్, అఖిల్‌లు తెలిపారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు.

సమస్యలు పరిష్కరించాలని డీఎంకు వినతి



డీఎం అలివేలును సన్మానిస్తున్న ప్రతినిధులు

తాండూరు: జిల్లాలోని రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం అలివేలు మంగమ్మను సోమవారం రైస్ మిల్లర్స్ అసోషియేషన్ ప్రతినిధులు కలిశారు. ఇటీవల డీఎంగా బాధ్యతలు చేపట్టిన అలివేలు మంగమ్మను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను డీఎం దృష్టికి తీసుకొచ్చారు. పౌరసరఫరాల శాఖకు సమయానికి బియ్యం సరఫరా చేస్తున్నామని అయినా నాలుగేళ్లుగా రైస్ మిల్లర్లకు కమీషన్ రాలేదని తెలిపారు. దీంతో స్పందించి ఆమె రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న సమస్య కావడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు, యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి నర్సింహులు, ప్రతినిధులు కిరణ్‌కుమార్, మహేష్, సలాం తదితరులున్నారు.

'బ్యాంకు' బాధలు తీర్చండి



వినతిపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో రైతులకు రైతుబంధు, రుణమాఫీ పథకాల పనులు పూర్తి చేసుకోవడంలో నిత్యం అవస్థలు పడుతున్నారని జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య అన్నారు. సోమవారం బ్యాంకు ఎదుట రైతులతో మాట్లాడారు. రుణమాఫీ పొందిన రైతుల రెన్యువల్ ప్రక్రియలో కొన్ని రోజులుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయ పనులు చేసుకునే తామ రోజంతా బ్యాంకు వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. బ్యాంకులో సిబ్బంది కొరత కారణంగా సమస్యలు తీరడం లేదని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

కొడంగల్‌కు ఎమ్మెల్యే చేసిందేమీ లేదు

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



గురునాథ్‌రెడ్డి, తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

కొడంగల్ రూరల్ : నియోజకవర్గానికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చేసిందేమిలేదని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి ఆరోపించారు. సోమవారం మండలంలోని రావులపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ డబుల్ బెడ్ రూం ఇవ్వలేదని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇక నుంచి గ్రామాల్లో పర్యటిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయనున్నట్లు చెప్పారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి దయాదాక్షిణ్యాలతో గెలిచిన నరేందర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రారంభించడం, తాను చేసిన పనులుగా చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. అవాకులు, చవాకులు మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి మహ్మద్ యూసుఫ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంతుకుమార్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయకుమార్, అన్న కిష్టప్ప, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు నయీమ్, ఇందనూర్ సర్పంచు బాల్‌రెడ్డి, వెంకట్రావు, కోట్ల హన్మంతు పాల్గొన్నారు.